RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | గురువారం | 15.8.2024

సంపుటి : 1 | సంచిక : 346 | పేజీలు : 4 | వెల : రూ. 5/-

## అక్రమ కట్టడాలపై హైడ్రా కొరడా

### - గోశామహల్‌లో ఆక్రమణల కూల్చివేత


హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు) : హైదరాబాద్ నగరంలోని అక్రమ నిర్మాణాలపై బల్దియా అధికారుల కొరడా ఝులిపిస్తున్నారు. రోడ్డు, ఫుట్ ఫాత్‌లపై నిర్మించిన అక్రమ కట్టడాలని కూల్చివేస్తున్నారు. గోశామహల్ నియోజకవర్గం పరిధిలోని బేగం బజార్ లో ఫుట్ పాత్ పై షెడ్ నిర్మించారు. దీంతో స్థానికులకు ఈ విషయాన్ని బల్దియా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానికుల ఫిర్యాదుతో అక్రమంగా నిర్మించిన షెడ్ ను క్రేన్ సహాయంతో తొలిగించారు బల్దియా అధికారులు. గత కొన్ని రోజులుగా హైదరాబాద్ సిటీతోపాటు ఊఓఆం పరిధిలో అక్రమనిర్మాణాలపై దృష్టి సారించారు హైడ్రా అధికారులు.. పాతబస్తీలోని ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలను బుధవారం ఆగస్టు 14, 2024 న తొలగించారు. బండ్లగూడలోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు తొలగించారు.

## కర్నూలు జిల్లాలో టిడిపి నేత దారుణ హత్య

### ➤ కళ్లల్లో కారం చల్లి హతమార్చిన దుండగులు

కర్నూలు, (ప్రభాత సూర్యుడు) : జిల్లాలో తెదేపా నేత దారుణహత్యకు గురయ్యారు. పత్తికొండ మండలం హోసూరులో ఈ ఘటన చోటుచేసుకుంది. తెదేపా నేత వాకిటి శ్రీనివాసులు (45) బుధవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లగా దుండగులు ఆయన కళ్లలో కారం చల్లి దారుణంగా హతమార్చారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఘటనాస్థలికి చేరుకుని

మిగతా 2లో...



### జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితులపై రాజ్‌నాథ్

## కీలక సమావేశం

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు) : కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌లో ఇటీవల కాలంలో పెరుగుతున్న ఉగ్రవాద సంబంధిత

2లో



### ఎమ్మెల్సీల నియామకానికి

## లైన్ క్లియర్

♦ హైకోర్టు తీర్పుపై స్టే విధించిన సుప్రీం

♦ నియామకాన్ని అడ్డుకోలేమన్న సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ, (ప్రభాత సూర్యుడు) : తెలంగాణలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకానికి లైన్ క్లియరైంది. ఇప్పటికే కోదండరాం, అమీర్ అలీఖాన్ లను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయాలని రాష్ట్ర కేబినెట్ గవర్నర్ కు సిఫార్స్ చేసింది. ఐతే కొత్త నియామకాలపై స్టే విధించాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ సుప్రీం కోర్టుకు వెళ్లారు. దీంతో గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బుధవారం సుప్రీం స్టే ఇచ్చింది. మరోవైపు కొత్త నియామకాలను చేపట్ట కుండా ఆపాలన్న పిటిషనర్ల కోరికను సుప్రీం తిరస్కరిం చింది. గవర్నర్, ప్రభుత్వ హక్కులను హరించినట్లే అవుతుందని తెలిపింది. ఎప్పటికప్పుడు నియామకాలు చేపట్టడం ప్రభుత్వ విధి అని వ్యాఖ్యానించింది. ఎమ్మెల్సీ ల నియామకంపై గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే విధించిండంతో కొత్త వారికి లైన్ క్లియర్ అయ్యింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు

మిగతా 2లో...

### హైదరాబాద్ చేరుకున్న

# సీఎం రేవంత్ బృందం

### - శంషాబాద్‌లో ఘనంగా స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు





హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు) : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బృందం విదేశీ పర్యటనను ముగించుకుని హైదరాబాద్ చేరుకుంది. అమెరికా, దక్షిణకొరియాలో సీఎంతో పాటు, మంత్రి శ్రీధర్‌బాబు, పలువురు అధికారులు పర్యటించారు. రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ఆయా దేశాల్లో వివిధ సంస్థల ప్రతినిధులతో సీఎం బృందం సమావే శాలు నిర్వహించింది. సీఎం బృందానికి శంషాబాద్

మిగతా 2వ పేజీలో..



### ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు

## మళ్లీ షాక్

ఢిల్లీ (ప్రభాత సూర్యుడు) : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మళ్లీ షాక్ ఎదురైంది. బుధవారం (ఆగస్టు 14) కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరుపుతుండగా ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ క్రమంలో కేజ్రీవాల్ తరపున కోర్టుకు హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ ఆరోగ్య కారణాలను చూపుతూ మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అభ్యర్థించారు. దీనిపై కోర్టు ఎలాంటి మధ్యంతర బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసింది. అయితే ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో సీబీఐ ద్వారా తనపై నమోదైన కేసులో బెయిల్ కోసం అరవింద్ కేజ్రీవాల్ మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో

2లో

## కంపు కొడుతున్న పల్లెలు, పట్టణాలు

- కాంగ్రెస్ పాలనలో పారిశుద్ధ్యం కొరవడింది
- నిధులు విడుదల లేక నీరసించిన గ్రామాలు
- మాజీమంత్రి కెటిఆర్ ఘాటు విమర్శలు



హైదరాబాద్, (ప్రభాత సూర్యుడు) : కాంగ్రెస్ పాలనలో.. పల్లెలు, పట్టణాలు కంపు కొడుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఓవైపు తెలంగాణ పల్లెల్లో పాలన పూర్తిగా పడకేసింది.. మరోవైపు పట్టణాల్లో పరిస్థితి అధ్వాన్నంగా మారింది.. ప్రజా పాలన అంటే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనా..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. అటు కేంద్రం నుంచి, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో పంచాయతీలు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడు తున్నాయి. పాత పనులకు ఎనిమిది నెలలైనా బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయిన తాజా మాజీ సర్పంచ్‌ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పారిశుధ్యం, డ్రైనేజీ నిర్వహణ అధ్వాన్నంగా మారడంతో.. ప్లలెల్లో ప్రజల జీవనం దినదిన గండంలా మారింది. దోమల మందుకు

మిగతా 2లో...

## గురుకుల హాస్టళ్ల సమస్యలపై దృష్టి

* అధికారులు తరచూ సందర్శించాల్సిందే
* మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



సిద్దిపేట, (ప్రభాత సూర్యుడు) : రాష్ట్రంలో గురుకుల హాస్టల్లలో సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం జిల్లాలో హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... ప్రతి జిల్లా కలెక్టరు, శాననసభ్యులు, విద్యశాఖ అధికారులు గురుకుల హాస్టళ్లను బాధ్యతగా సందర్శించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అన్ని గురుకులాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు స్థానిక నిధులతో ఎలాంటేషన్ పనులను

2లో

### జోగి రమేశ్ మాటలు

## అవివేకానికి నిదర్శనం

### మంత్రి పార్థసారథి..



అమరావతి (ప్రభాత సూర్యుడు) : రాజకీయ కక్ష్యలతోనే తన కుమారుడు రాజీవ్‌ను అరెస్టు చేశారంటూ మాజీ మంత్రి జోగి రమేశ్ మాట్లా డడం అవివేకానికి నిదర్శనమని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అగ్రిగోల్డ్ భూముల వ్యవహారంలోనే అతణ్ని అరెస్టు చేసినట్లు మంత్రి స్పష్టం చేశారు. కక్ష్య సాధింపు చర్యలు అనేవి ఎన్డీయే ప్రభుత్వంలో ఉండవని ఆయన తేల్చి చెప్పారు. అధికారం చేపట్టిన తొలినాళ్లలోనే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో ఎవ్వరూ అవినీతి చేసినా చర్యలు తప్పవంటూ హెచ్చరించారు. అగ్రిగోల్డ్ భూమిని చట్ట వ్యతిరేకంగా కొనుగోలు

2లో



## ఆదానీకి ఉక్కు కవచంగా ప్రధాని మోడీ

➤ సెబీప ఆదానీ బంధంపై దేశవ్యాప్త ఉద్యమం

➤ సిపిఐ నేత నారాయణ ప్రకటన

విజయవాడ, (ప్రభాత సూర్యుడు) : సెబి అదానీ అంశంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అదానికి ఇనుప కవచంలా మోదీ ఉన్నారని వ్యాఖ్యలు చేశారు. మోదీ వచ్చాక వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధానికి అహంభావం పెరిగిపోయిందని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా చర్యలు చేపట్టారన్నారు. ఎవరినైతే జైల్‌లో పెట్టారో వారే బంగ్లాదేశ్‌కు ప్రధాని అయ్యారన్నారు. హిందువులపై దాడులు చేస్తున్న వీడియోలు పెట్టి బీజేపీ పెద్ద యెత్తున ప్రచారం చేస్తున్నారన్నారు. వయనాడ్‌లో

మిగతా 2లో

# సంపాదకీయం

## తరం మార్పులో తిరస్కృతుడైన నెహ్రూవాది

ఆకులు పండిపోయి నేలరాలడం, చెట్లు మళ్లీ చిగురించి నవ నవోన్మేషంగా మారడం ప్రకృతికి ఎంత సహజమో, మానవ సమాజానికి కూడా అంతే సహజం. మూడు రోజుల క్రితం మరణించిన 95 సంవత్సరాల మాజీ విదేశాంగ మంత్రి నట్వర్‌సింగ్ కొన్ని దశాబ్దాల కాంగ్రెస్ చరిత్ర, సంస్కృతికి ప్రతీకగా నిలిచారు. ఆయన మరణంతో కాంగ్రెస్‌ను పెనవేసుకున్న ఒక రాజకీయ సంస్కృతి కూడా అదృశ్యమైందని చెప్పవచ్చు. నిజానికి నట్వర్‌సింగ్‌తో కాంగ్రెస్ భవబంధం దాదాపు దశాబ్దంన్నర క్రితమే సమసిపోయింది. ఎన్‌డి తివారి, ఫోతేదార్, శివశంకర్, కోట్ల విజయ భాస్కరరెడ్డి, పి.వి.నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీ, మోతీలాల్ వోరా, అర్జున్‌సింగ్, గాడ్గిల్ తదితరులతో పాటు నట్వర్‌సింగ్ కూడా చివరకు కాలగమనంలో కలిసిపోయారు. నిజానికి ఈ నేతల్లో చాలా మంది కంటే నట్వర్‌సింగ్ జూనియర్. రాచకుటుంబంలో పుట్టి, నెహ్రూ హయాంలో విదేశాంగ సర్వీసులో చేరి ఆయన చెల్లెలు కృష్ణహాతీ సింగ్ పిల్లలతో పాటు కలిసి చదువుకున్నందువల్ల గాంధీ కుటుంబ కోటరీలో చేరగలిగిన నట్వర్‌సింగ్ పలువురు కాంగ్రెస్ నేతల మాదిరే ఆ కుటుంబ ఆంతరంగిక సభ్యులుగా మెలిగారు. ఇందిర మరణానంతరం రాజీవ్ గాంధీ హయాంలో రాజకీయాల్లో ప్రవేశించి పార్లమెంట్ సభ్యుడుగా తొలిసారి గెలిచిన నట్వర్‌సింగ్ నెహ్రూవియన్ ఆలోచనా విధానానికి చెందినవారు. ఇందిర హయాంలో విదేశాంగశాఖ అధికారిగా ఉండగానే ఆయన పద్మభూషణ్ పురస్కారాన్ని పొందారు. రాజీవ్ హయాంలో విదేశాంగ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. కాని నట్వర్‌సింగ్ ఆ సమయంలో విదేశాంగ విధానంలో జరిగిన తప్పులను నివారించలేకపోయారు. ఎంత మేధావి అయినా అధికారంలో ఉన్నవారికి సమీపంలో ఉండాలని నిర్ణయించుకున్న వారికి తమ అధినేతలు చేసే తప్పులను ఆ సమయంలో ప్రశ్నించే ధైర్యం ఉండదు. తమ అధినేతల కటాక్ష వీక్షణాలకు దూరమైన తర్వాత వారు చేసిన తప్పులను విమర్శిస్తే మాత్రం ప్రయోజనం ఏముంటుంది? రాజీవ్ మరణానంతరం అర్జున్‌సింగ్‌తో పాటు ప్రధానమంత్రి కావాలని ఆశించిన వారిలో నట్వర్‌సింగ్ ఒకరు. కాని ఆ అవకాశం పి.వి.కి దక్కడంతో అసమ్మతివాదులుగా మారిపోయారు. అర్జున్, తివారీ, షీలాదీక్షిత్‌లతో కలిసి సూరజ్‌కుండ్ ఏఐసిసి సదస్సులో నిరసన తెలిపారు. పి.వి.కి అడుగడుగునా కష్టాలు సృష్టించారు. 'మేము ఎన్ని కష్టాలు సృష్టించినా పి.వి. ప్రభుత్వం చెక్కుచెదరలేదు. అయిదు సంవత్సరాలు నిబ్బరంగా మైనారిటీ ప్రభుత్వాన్ని నిర్వహించారు. మా అందరికంటే ఆయనే తెలివైన నాయకుడని నిరూపించుకున్నారు' అని నట్వర్‌సింగ్ తన ఆత్మకథలో వాపోయారు. తర్వాత మరోసారి యూపీఏ హయాంలో కూడా విదేశాంగ మంత్రిగా అవకాశం వచ్చినప్పటికీ అప్పటికే విదేశాంగ విధానం అలీన లక్షణాలను కోల్పోయి, ఆర్థిక విధానాల ఆధిపత్యానికి లోనయ్యే క్రమం వేగవంతమైంది. ఆ క్రమంలోనే ఆయన నిష్క్రమణకు రంగం సిద్ధమైంది. ఇరాక్ నుంచి చమురు దిగుమతి చేసుకుని ఆహార సరఫరాలు చేసే పథకానికి సంబంధించి నట్వర్ సింగ్, ఆయన కుమారుడు లబ్ధిదారులు అన్న ఆరోపణలు రావడంతో 2006లో కాంగ్రెస్ ఆయనను బహిష్కరించింది. ఆ సమయంలో ఆయన మౌనంగా ఉండి, సోనియా శరణు వేడినా తర్వాతి కాలంలో కాంగ్రెస్ చేరదీసి ఉండేదేమో? కాని నెహ్రూ కుటుంబానికి, కాంగ్రెస్‌కు అంకితభావంతో సేవ చేసిన తనకు పార్టీ అండగా నిలబడకపోవడంతో ఆయన మనసు గాయపడి కాంగ్రెస్‌ను ధిక్కరించారు. ఆయన కుమారుడు బీజేపీలో చేరాడు. నట్వర్ సైతం తన చరమదశలో నరేంద్రమోదీని కలిసి ప్రశంసల వర్షం కురిపించడం ఆయన వ్యక్తిత్వాన్ని మరింత పలచన చేసింది. చివరకు పూర్తిగా విస్మరణకు గురై, పలకరించేవారు కరువైన పరిస్థితుల్లో నట్వర్ దివంగతులయ్యారు. రాజారావు, నిరాద్ చౌదురి, ఆర్ కేనారాయణ్, తక్కజి శివశంకర పిళ్లై లాంటి ఎందరో రచయితలతో సన్నిహిత సంబంధాలుండి, సాహిత్యంలో మంచి అభినివేశం ఉన్న నట్వర్‌సింగ్ మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను మార్చుకోలేక నిష్క్రమించిన అనేకమంది కాంగ్రెస్ నేతల్లో ఒకరని చెప్పక తప్పదు.

## కర్నూలు జిల్లాలో టిడిపి నేత దారుణ హత్య

కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ జయన్న ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించి విచారణ చేపట్టారు. తెదేపా ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు కూడా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. హత్య ఘటనకు దారితీసిన పరిస్థితులను డీఎస్పీతో మాట్లాడారు. నిందితులను గుర్తించి తక్షణమే అరెస్టు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఎమ్మెల్యేకు శ్రీనివాసులు ప్రధాన అనుచరుడు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కీలకంగా వ్యవహరించారు. మృతుడి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. వైకాపాకు చెందిన వారే హతమార్చినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీనివాసులు హత్య కేసును త్వరగా ఛేదిస్తామని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ ద్వారా కేసును కొలిక్కి తెస్తామన్నారు. శ్రీనివాసులుకు గ్రామంలో ఎవరితో ఎలాంటి గొడవలు లేవని చెప్పారు. హత్య జరిగిన ప్రాంతానికి కిలోమీటర్ దూరంలో బీర్ సీసాలు గుర్తించినట్లు తెలిపారు. తల వెనుక భాగంలో మారణాయుధాలతో బలంగా దాడి చేసి చంపారని డీఎస్పీ వివరించారు.

## జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితులపై రాజ్‌నాథ్ కీలక సమావేశం

ఘటనలపై రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారంనాడు కీలక సమావేశం ఏర్పాటు చేశారు. రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్ అరమనె, జాతీయ భద్రతా సలహాదారులు అజితో ధోవల్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, మిలటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ, భద్రతా సంస్థల అధిపతులు సౌత్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం జరుగనున్న తరుణంలో ఈ సమావేశం ప్రాధాన్యతను సంత రించుకుంది.

జమ్మూకశ్మీర్‌లో హైఅలర్ట్

మరోవైపు, స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ప్రజా భద్రత కోసం జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలు హై అలర్ట్ ప్రకటించాయి. జమ్మూ ప్రాంతంలో ఇటీవల ఉగ్రవాద ఘటనల తిరిగి పెరుగుతున్న నేపథ్యంలో బలగా లు కూంబింగ్ కొనసాగిస్తున్నారు.

తాజాగా బుధవారం నాడు దోడా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇండియన్ ఆర్మీ కెప్టెన్ దీపక్ సింగ్ ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు ఉగ్రవాదులు హతమైనట్టు తెలుస్తోంది. కాగా, దీనికి ముందు ఆగస్టు 10న అనంతనాగ్‌లో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన హెూరా హెూరీ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు సైనికులు, ఒక పౌరుడు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల కాలంలో కథువా, దోడా, ఉదయంపూర్‌లో ఆర్మీ కాన్వాయ్‌పై దాడి సహా పలు ఉగ్రదాడులు చోటుచేసుకున్నాయి. జూలై 21 వరకూ జరిగిన 11 టెర్రర్ రిలేటెడ్ ఇన్సిడెంట్లు, 24 కౌంటర్ టెర్రర్ ఆపరేషన్లలో భద్రతా సిబ్బంది, పౌరులతో సహా 28 మంది మృతి చెందినట్టు కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ ఇటీవల లోక్‌సభకు తెలిపింది. గత నెలలో కుప్వారా జిల్లాలో ఎల్ఓసీ వెంబడి పాకిస్థాన్ బోర్డర్ యాక్షన్ టీమ్ (బ్యాట్) దాడులను భారత భద్రతా బలగాలు సమర్ధవంతంగా తిప్పికొట్టాయి. ఈ ఘటనలో పాకిస్థాన్ చొరబాటుదారుతో పాటు, ఇండియన్ ఆర్మీ జవాను ఒకరు ప్రాణాలు కోల్పోయారు. మేజర్ ర్యాంక్ అధికారితో సహా నలుగురు గాయపడ్డారు.

## కంపు కొడుతున్న పల్లెలు, పట్టణాలు

కూడా నిధులు లేకపోవడంతో పంచాయతీల్లో డెంగ్యూ, మలేరియా విజృంభిస్తున్నాయి. పంచాయతీలకు నిధులివ్వకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమేనా.. మీ ప్రజాపాలన అంటే.. ?? అని కేటీఆర్ నిలదీశారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతి నెలా పంచాయితీలకు ఠంచన్‌గా రూ.275 కోట్లు విడుదల చేశాం. నేడు.. పెండింగ్ బిల్లులు చెల్లించాలని అడిగిన పాపానికి 1800 మాజీ సర్పంచ్‌లపై నిర్బంధాలు.. అక్రమ అరెస్టులు. 15వ ఆర్థిక సంఘం నుంచి అందిన రూ.500 కోట్ల నిధులను గ్రామపంచాయతీలకు ఇంకెప్పుడు ఇస్తారు..? ఉపాధి హామీ పథకం, హెల్త్ మిషన్ నుంచి వచ్చిన రూ.2100 కోట్ల కేంద్ర నిధులను ఎందుకు దారి మళ్లించారు.. 12,769 పంచాయితీల్లో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలే రూ.4305 కోట్లని అంచనా. వాటి పరిస్థితి ఏంటని కేటీఆర్ ప్రశ్నించారు. దేశానికే పట్టుగొమ్మలుగా భావించే పల్లెలపై కాంగ్రెస్ పాలనలో ఎందుకింత నిర్లక్ష్యం.. కాంగ్రెస్ పాలనలో.. ప్లలెల్లో పాలన పూర్తిగా పడకేస్తే.. ఇక పట్టణాలు పెను సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రేటర్ తోపాటు.. రాష్ట్రంలోని 12 కార్పొరేషన్లు, 129 మున్సిపాలిటీల్లో కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి. రాష్ట్ర బ్జడెట్ లో జీహెచ్ఎంసీకి అరకొర నిధులు కేటాయించడంతో.. మహానగరంలో అభివృద్ధి పనులు పూర్తిగా మూలనపడిన మాట వాస్తవం కాదా.. కాంగ్రెస్ చెప్పుకునే ప్రజాపాలనలో.. పల్లె ప్రగతికి పాతరేసి.. పట్టణ ప్రగతిని అడ్రస్ లేకుండా చేసిన మాట నిజం కాదా.. అని కేటీఆర్ అడిగారు. ఎన్సిపాలిటీల్లో పెండింగ్ పనులకు మోక్షం లేదు.. కొత్త పనులకు ప్రణాళిక లేదు. నిధులు లేక పూర్తిగా నీరసించిన మున్సిపాలిటీల్లో కనీసం అత్యవసర మరమ్మత్తులకు కూడా పైసలు లేకపోవడం దుర్మార్గం కాదా..? వర్షాకాలంలో అధ్వాన్నంగా మారిన రోడ్లతో ప్రతినిత్యం అవస్థలు పడుతున్న ప్రజలకు ఏం సమాధానం చెబుతారు..? మున్సిపాలిటీల్లో రూ.1200 కోట్లకుపైగా ఉన్న పెండింగ్ బిల్లులను ఇంకెప్పుడు విడుదల చేస్తారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా పర్యవేక్షిస్తున్న మున్సిపల్ శాఖకే ఈస్థాయిలో నిధుల కొరత ఉంటే.. ఇక ఇతర శాఖల దుస్థితి ఏమిటి..? అని కేటీఆర్ మండిపడ్డారు. ఆగష్టు 15 లోపు బకాయిలు చెల్లించకపోతే ఆందోళనకు సిద్ధమవుతున్న మున్సిపల్ కాంట్రాక్టర్ల కష్టాలను తీర్చే తీరిక ఈ ప్రభుత్వానికి ఉందా..? కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి నుంచి పురపాలక శాఖను ఇప్పటికైనా గట్టెక్కించే ధైర్యం ఉందా..? మున్సిపాలిటీల్లో దెబ్బతిన్న రోడ్లు, పొంగిపొర్లుతున్న డ్రైనేజీల మరమ్మత్తులను యుద్ధప్రాతిపదికన చేపట్టే ఆలోచన ఉందా..? బీఆర్ఎస్ హయాంలో పదేళ్లు పచ్చగా కళకళలాడిన ప్లలెలు, ప్రగతిపథంలో దూసుకుపోయిన పట్టణాలు.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సంక్షోభంలో కొట్టుమిట్టాడటం మీ అసమర్థతకు, పాలనా వైఫల్యాలకు నిలువెత్తు నిదర్శనం.. మీ చేతకానితనాన్ని తెలంగాణ సమాజం గమనిస్తోందనే విషయాన్ని మరిచిపోకండి అని కేటీఆర్ పేర్కొన్నారు.

## హైదరాబాద్ చేరుకున్న సిఎం రేవంత్ బృందం

ఎయిర్‌పోర్టులో పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ శ్రేణులు స్వాగతం పలికారు. అమెరికా, దక్షిణ కొరియా పర్యటనల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. రేవంత్ రెడ్డి అమె రికా, దక్షిణ కొరియా పర్యటన విజయవంతంగా ముగిసిందని శ్రేణులు పెద్ద ఎత్తున విమానాశ్రయానికి చేరుకున్నారు. పెట్టుబడులే లక్ష్యంగా సీఎం విదేశీ పర్యటన సాగగా.. చాలా రోజుల తర్వాత రేవంత్ రెడ్డి హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ నెల 3న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రతినిధి బృందం అమెరికాకు వెళ్లింది. 10న అమెరికా నుంచి బయలుదేరి 11న దక్షిణ కొరియాలోని సియోల్ కి చేరుకున్నారు. దక్షిణ కొరియాలో రెండ్రోజుల పాటు రేవంత్ రెడ్డి పర్యటించారు. పెట్టుబడులే లక్ష్యంగా అమెరికా, దక్షిణ కొరియాలో పర్యటించారు. అక్కడ పలు కంపెనీలతో ఎంవోయూలు చేసుకున్నారు. అందులో భాగంగా కాగ్నిజెంట్‌తో చేసుకున్న ఒప్పందం మేరకు.. వచ్చి రాగానే కోకాపేటలో కొత్త క్యాంపస్‌కి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ నెల 5న తెలంగాణ సర్కార్‌తో కాగ్నిజెంట్ సంస్థ అమెరికాలో ఎంవోయూ చేసుకుంది. ఆ మేరకు 10 రోజుల్లోనే విస్తరణకు శ్రీకారం చుట్టారు. అమెరికా వేదికగా తెలంగాణను ఫ్యూచర్ స్టేట్‌గా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ 4.0 సిటీగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న వివిధ ప్రాజెక్టులకు భారీ స్పందన వచ్చింది. తెలంగాణను పెట్టుబడుల గమ్యస్థానంగా అమెరికాలోని పారిశ్రామికవేత్తల దృష్టిని ఆకర్షించారు. పర్యటనలో భాగంగా 50కి పైగా సమావేశాలు, 3 రౌండ్ టేబుల్ మీటింగ్‌లు నిర్వహించి పలు కంపెనీలను క్షేత్ర స్థాయిలో సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు వివిధ రంగాల్లో పేరొందిన భారీ కంపెనీలు ముందుకు వచ్చాయి. ఈ పర్యటనలో 31 వేల 532 కోట్ల రూపాయల పెట్టుబడుల కోసం 19 కంపెనీలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. దీంతో, రాష్ట్రంలో 30 వేల 750 కొత్త ఉద్యోగాలు లభించనున్నాయి. దక్షిణ కొరియాలో పలువురు పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్ రెడ్డి చర్చలు జరిపారు. కొరియా బ్యూటీ ఇండస్ట్రీ ట్రేడ్ అసోసియేషన్‌తో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. శాంసంగ్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, జీఎస్ క్టలెక్స్, సెల్ ట్రయాన్ కంపెనీ ప్రతినిధుల తోనూ సీఎం రేవంత్ రెడ్డి చర్చలు జరిపారు. హన్ రివర్ ప్రాజెక్టును సందర్శించి సియోల్ డిప్యూటీ మేయర్‌తో భేటీ అయ్యారు. శామ్‌సంగ్ హెల్త్ కేర్ యూనిట్‌తో సమావేశమై చర్చలు జరిపారు. అలాగే కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సీఎం రేవంత్ రెడ్డి బృందం సందర్శించింది. కాల్ టెక్స్ కంపెనీ ప్రతినిధులతో పెట్టుబడులపై చర్చలు జరిపింది. ఇప్పటికే వరంగల్ టెక్స్‌టైల్స్ పార్కులో పెట్టుబడులు పెట్టేందుకు కొరియా ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ సానుకూలంగా స్పందించింది.

## ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు మళ్లీ షాక్

నోటీసులు జారీ చేసి సమాధానం కోరింది. ఈ అంశంపై తదుపరి విచారణ ఆగస్టు 23న ఉంటుందని కోర్టు తెలిపింది. లిక్కర్ పాలసీ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియాకు దాదాపు 17 నెలల తర్వాత బెయిల్ లభించింది.

కోర్టులో ఏం జరిగింది?

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు సీబీఐకి నోటీసులు జారీ చేసింది. నిజానికి విచారణ సమయంలో సీబీఐకి చెందిన వారెవరూ కోర్టుకు హాజరుకాలేదు. ఆరోపించిన ఎక్సైజ్ పాలసీ స్కామ్‌కు సంబంధించిన అవినీతి కేసులో సీబీఐ తన అరెస్టును కొనసాగించాలన్న ఢిల్లీ హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌ను కోరారు. ఆగస్టు 23లోగా సీబీఐ నుంచి సమాధానం కోరిన సుప్రీంకోర్టు.. ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది.

## జోగి రమేశ్ మాటలు అవివేకానికి నిదర్శనం

చేసినందునే జోగి రాజీవ్ అరెస్టు జరిగిందని మంత్రి పార్థసారథి చెప్పారు. ఈడీ అటాచ్మెంట్‌లో ఉన్న భూములు కొనుగోలు చేయటం ఎంత వరకు సబబో జోగి రమేశ్ చెప్పాలని మంత్రి అన్నారు. సర్వే నంబర్లు ఎందుకు మార్పులు చేశారో ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అక్రమ అరెస్టు చేశారంటూ వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారని పార్థసారథి మండిపడ్డారు. ఎన్ని అబద్ధపు ప్రచారాలు చేసి తప్పును కప్పిపుచ్చుకోవాలని చూసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. ప్రతి పేదవాడి ఆకలి తీర్చేందుకే ఆగస్టు 15నుంచి అన్న క్యాంటిన్లు పునఃప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం పేదవాడి నోటి దగ్గర నుంచి కూడు లాక్కుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి తక్కువ ధరకే నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అన్న క్యాంటీన్ల ద్వారా అందిస్తామని మంత్రి పార్థసారథి చెప్పుకొచ్చారు.

## గురుకుల హాస్టళ్ల సమస్యలపై దృష్టి

పూర్తిచేయాలని ఆదేశించామన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచేందుకు ప్రభుత్వం చర్చలు జరుపుతోందని.. త్వరలోనే విద్యార్థులకు శుభవార్త చెప్తామని తెలిపారు. విద్యారంగ సమస్యలకు 5,000 కోట్ల రూపాయలు కేటాయించామన్నారు. అసౌకర్యాలతో ఉన్న అన్ని విద్యాసంస్థలకు స్థలాల కేటాయింపు జరిపి పక్కా భవనల నిర్మాణం చేపడతామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 42 రైతు వేదికల ద్వారా యువ రైతులకు విజ్ఞప్తి చేస్తున్నా... యువరైతులకు వ్యవసాయాధారిత పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం తరపున అవసరమైన రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గం యువరైతులకు వ్యవసాయ ఆధారిత పథకాలకు అవసరమైన రుణాలు ఇప్పించేందుకు తాను, యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## ఆదానీకి ఉక్కు కవచంగా ప్రధాని మోడీ

బాధితులను ఆదుకునేందుకు సీపీఐ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. పార్టీ తరుపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గవర్నర్ జోక్యాన్ని ఖండిస్తున్నా మన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి జైల్‌లో ఉన్నందున మరొకరికి వేడుకల బాధ్యతలు అప్పగించారన్నారు. గవర్నర్ జోక్యం చేసుకుని అడ్డుకోవడం సరికాదన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తుల అంశంలో మాజీ మంత్రి కొడుకును అరెస్టు చేశారని.. జోగి రమేష్ విషయం ఒకటే బయటకు వచ్చింది. ఇంకా ఇలాంటి ఘటనలు చాలా ఉన్నాయని నారాయణ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని విషయాలపై దృష్టి పెడుతున్నారు కానీ రైతులపై సరైన దృష్టి పెట్టడం లేదని సీపీఐ నేత కె రామకృష్ణ అన్నారు. రైతులకు పంట నష్ట పరిహారానికి సంబంధించి ప్రీమియం చెల్లించలేదన్నారు. ఖరీఫ్ పూర్తవుతున్న పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వలేదన్నారు. ఇచ్చే పరిహారం సకాలంలో ఇస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి కర్నాటక ప్రభుత్వం వేగంగా స్పందించిందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అన్ని ప్రాజెక్టులను సందర్శించి నిర్వహణ కోసం పూర్తిస్థాయిలో నిధులు కేటాయించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్సీల నియామకానికి లైన్ క్లియర్

స్టే అమల్లో ఉంటుందని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. తమ నియామకాన్ని పక్కన పెట్టి కొత్తగా ఎమ్మెల్సీలను గవర్నర్ కోటాలో ఎంపిక చేయడాన్ని సవాలు చేస్తూ భారాస నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ సుప్రీంకోర్టును ఆశ్రయిం చారు. దీనిపై అత్యున్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. కొత్తగా ఎమ్మెల్సీలను నియమించకుండా స్టే విధించాలని పిటిషనర్లు కోరగా.. ధర్మాసనం నిరాకరిం చింది. కొత్త ఎమ్మెల్సీల నియామకాన్ని అడ్డుకుంటే గవర్నర్, ప్రభుత్వ హక్కులు హరించినట్లు అవుతుందని వ్యాఖ్యానించింది. ఎప్పటికప్పుడు నియామకాలు చేపట్టడం ప్రభుత్వ విధి అని పేర్కొంది. అనంతరం పిటిషన్‌పై విచారణను ధర్మాసనం నాలుగు వారాల పాటు వాయిదా వేసింది. ప్రతివాదులుగా ఉన్న గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వానికి జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరలే ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.


# మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్ష బరిలో ఆళ్లకుంట



కల్లూరు ప్రభాత సూర్యుడు : కల్లూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్ష బరిలో సత్తుపల్లి శాసన సభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కుటుంబ విధేయుడు, సత్తుపల్లి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆళ్లకుంట నరసింహారావు స్థానిక ఎమ్మెల్యే ఆశీస్సులతో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బరిలో ఉన్నారు. కల్లూరు మండల యువత 18 నుంచి 35 సంవత్సరాల వయసు ఉన్న అన్నదమ్ములు, అక్క చెల్లెమ్మలు, కాంగ్రెస్ అభిమానులు, యూత్ కాంగ్రెస్ లో ఓటు నమోదు చేసుకుని మీ అమూల్యమైన ఓటు కాంగ్రేస్ పార్టీ కి వేసి యూత్ కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ ఆళ్ళకుంట నరసింహారావును అత్యధిక మెజారిటీ తో గెలిపించగలరని వేడుకుంటున్నారు.


# పాఠశాలకు మోటూరు, పైప్ లైన్ సామాగ్రి వితరణ

## -రేపాకుల రామకృష్ణ పాఠశాల కి విద్యుత్ మోటూరు వితరణ




కల్లూరు ప్రభాత సూర్యుడు : మండల పరిధి ఎర్రబోయినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు యువజన కాంగ్రెస్ నాయకుడు రేపాకుల రామకృష్ణ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ నియోజకవర్గ వ్యాప్తంగా చేసే సేవాకార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని తమవంతుగా రూ. పదివేల విలువగల విద్యుత్ మోటర్, పైప్ లైన్ సామాగ్రి వితరణ చేశారు. పాఠశాలలోని విద్యార్థులు త్రాగునీటి సౌకర్యం కోసం అవస్థలు పడుతుండగా ఆ మేరకు స్పందించి విద్యార్థుల కోసం చేయూత నిచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం పవన్ కుమార్ ఉపాధ్యాయులు విద్యార్థులు దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఫోట్రు అర్జున్ రావు, బత్తుల రాము, కాకర్ల కృష్ణ, చీకటి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన పోలీస్ సిబ్బంది



ప్రభాత సూర్యుడు - సిద్దిపేట అర్బన్ : 80 సంవత్సరాల ముగిలవ్వ మతిస్థిమితం కోల్పోయి. ఆమె ఎక్కడికి వెళ్లాలో తెలియక అంబేద్కర్ నగర్ లో తిరుగుతూ కనిపించింది. అక్కడ ఉన్న స్థానికులు 100 కు డయల్ చేశారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ సంబంధించిన సిఐ ఉపేందర్ కు అందిన సమాచార ప్రకారం అక్కడ ఉన్న పోలీస్ సిబ్బందిని వెళ్ళమని చెప్పారు. ఆదేశాల మేరకు వెంటనే వెళ్లిన పోలీస్ సిబ్బంది. తొట్ల రవీందర్ డ్రైవర్ కోలేపాక ప్రదీప్ తనను తీసుకొని సిద్ధిపేట మున్సిపాలిటీకి సంబంధించిన వృద్ధాశ్రమంలో అప్పగించారు. దాంతో అక్కడి స్థానికులు వారిని ప్రశంసించారు.

# 16న లక్ష్మీదేవి కుంకుమ పూజ కార్యక్రమం

గుడివాడ (ప్రభాత సూర్యుడు) :తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రావణ మాసం సందర్భంగా గుడివాడ లో గల శ్రీ రామ సహిత సత్యనారాయణ స్వామి దేవాలయం మరియు ట్రస్టు ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారం అనగా ది 16వ తేది సాయంత్రం 5 గంటలకు లక్ష్మి దేవి కుంకుమ పూజ కార్యక్రమం ప్రారంభం . ఈ కార్యక్రమంలో తితిదే వారు పసుపు,కుంకుమ, అమ్మ వారి రూపు ను ఇస్తారు. కావున భక్తులు పూజా సామాగ్రి తో విచ్చేసి కార్యక్రమం దిగ్విజయం చేసి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరు. తదుపరి తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుంది. వివరాలకు ఆలయ ప్రధాన అర్చకులు కుమార్ గారిని నెంబర్ 9908366811, గాని తితిదే విశిష్ట ధర్మాచార్య కావూరి శ్రీధర్ 7780680169 గాని సంప్రదించగలరు

# రేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలి

## బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట అసెంబ్లీ కమిటీ డిమాండ్




ప్రభాత సూర్యుడు - సిద్దిపేట అర్బన్ : బహుజన్ సమాజ్ పార్టీ సిద్దిపేట అసెంబ్లీ కమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీ అధ్యక్షుడు పుల్లూరు ఉమేశ్ అధ్యక్షతన సిద్దిపేటలోని స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిధిగా జిల్లా ఉపాధ్యక్షుడు ఈర్ల మల్లేశం ముదిరాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,రేషన్ కార్డుల కోసం..ఉప సంఘం, కమిటీలు అంటూ కాలపాయన చేసే పనులు మానుకోవాలి. ఎంతో మంది కొత్తగా పెళ్లయిన వారు వలస వెళ్లిన వాళ్లు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు అద్దె ఇంట్లో ఉన్నవారికి గృహ జ్యోతి వర్తించడం లేదు. గ్యాస్ సబ్సిడీ ఇటీవల రైతు రుణమాఫీ అన్నింటికీ కుటుంబం యూనిట్ రేషన్ కార్డు ఆధారం అంటూ కొర్రీలు పెట్టి అనేకమందిని సంక్షేమ పథకాలకు దూరంగా ఉండేలా చేశారు. తమ సంక్షేమ పథకాలను కర్తరింపు కోసం కొత్త రేషన్ కార్డులు అంటూ డ్రామాను నడుపుతున్నారు. ఇలాంటివి చేసే గత బీఆర్ఎస్ ప్రభుత్వం గాలి లో కొట్టుకొని పోయింది. కాంగ్రెస్ సర్కారు అదే దారి న వెళ్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తోంది. ప్రజల అభిష్టం మేరకు రాష్ట్ర పరిపాలన సాగించాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో నాయకులు అసంబ్లీ ఉపాధ్యక్షుడు పంగా బాబూ నంగునూరు మండల అధ్యక్షుడు లింగం, నారాయణరావుపేట మండల అధ్యక్షుడు బండారి శంకర్, సిద్దిపేట రూరల్ మండల అధ్యక్షుడు హరి కిరణ్ మహేష్, సంపత్ లు పాల్గొన్నారు.

# యూత్ కాంగ్రేస్ లో ఓటర్ల నమోదు కార్యక్రమం

## -గ్రామం పంచాయితీ లో కాంగ్రెస్ యూత్ నాయకుడు పరిమి భరత్ ఆధ్వర్యంలో



కల్లూరు ప్రభాత సూర్యుడు: కాంగ్రెస్ యూత్ అధ్యక్ష బరిలో సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కుటుంబ విధేయులు. సత్తుపల్లి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పసుమర్తి విశ్వనాథ్ మరియు ఆళ్లకుంట నరసింహారావు స్థానిక ఎమ్మెల్యే ఆశీస్సులతో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బరిలో ఉన్నారు. పేరువంచ గ్రామం లో ఉన్న యువత 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉన్న అన్నదమ్ములు, అక్క చెల్లెమ్మలు, కాంగ్రెస్ అభిమానులు, యూత్ కాంగ్రెస్ లో ఓటు నమోదు చేసుకుని మీ అమూల్యమైన ఓటు యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ప్రెసిడెంట్ పసుమర్తి విశ్వనాథ్ కి మరియు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షు నిగా ఆళ్ళకుంట నరసింహారావు ఎన్నికల టీ యల్ నేబర్ మూడవ మరియు నాలుగ వ నెంబర్ పైన మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించగలరని కోరుతూ పేరువంచ యూత్ కాంగ్రెస్ నాయకుడు పరిమి భరత్ అధ్యక్షతన ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో కల్లూరు వ్యవసాయం కమిటీ చైర్మన్ భాగం నిరజా ప్రభాకర్ చౌదరి, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు శివకుమార్ నాయక్,మండలం యూత్ కాంగ్రెస్ నాయకులు యాసా శ్రీకాంత్,%ంఎ% ఇస్మాయిల్, కాంగ్రెస్ సాంబా,బాజీ, బొల్లం ఉపేంద్ర, యూసఫ్, తిరుపతి రావు, గాదె సుధాకర్ రెడ్డి,కోనూరి పుల్లయ్య,కొండపల్లి మురళి,కీసర జీవన్ రెడ్డి,గాదె కిరణ్, ఉబ్బన అశోక్, సన్నీ, చిన్నరాము, ప్రభాకర్ రెడ్డి, బడుగు వెంకటేశ్వర్ రావు, దొడ్డి యేసు రెడ్డి, యన్నం దుర్గ పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించండి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

నంద్యాల, ఆగస్టు 14: ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా జిల్లాలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామ, మండల, నియోజకవర్గ, డివిజనల్ కేంద్రాలలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగులు, ప్రముఖ వ్యక్తులను సమన్వయం చేసుకొని ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత ఫోటోలను హర్ ఘర్ త్రిరంగ వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని పర్యాటక అధికారిని ఆదేశించారు. ర్యాలీలో జాతీయ జెండాను మోస్తున్న ప్రజల ఫోటోలను అప్‌లోడ్ చేసేలా డిజిటల్ సహాయకులకు ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని పాఠశాలలు, విద్యాసంస్థల్లో దేశభక్తి గీతాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిఇఓ ను కలెక్టర్ ఆదేశించారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను అభినందిస్తూ స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానించాలని కలెక్టర్ సూచించారు. రిజర్వాయర్లు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులలో జెండాలు మోస్తు తిరంగా కార్యక్రమాలను నిర్వహించాలని ఫిషరీస్ జాయింట్ కలెక్టర్ ను ఆదేశించారు. ప్రతి ఇంటిపై మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేయాలని ఈ సందర్భంగా ప్రజలను కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరూ ప్రతి ఇంటిపై మువ్వన్నెల జాతీయ పతాకను ఎగురవేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పిలుపు నిచ్చారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకు, జాతీయ జెండా ప్రాముఖ్యతను ప్రజలందరికీ తెలియజేసి వారిలో చైతన్యాన్ని కలిగించేందుకు ఊరూ వాడా హర్ ఘర్ తిరంగా ర్యాలీలను నిర్వహించుటలో జిల్లా కలెక్టర్లు కీలక భూమిక పోషించాలని సిఎస్ ఆదేశించారు.

# క్లిష్టపరిస్థితుల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి చెందేలా అందరూ సహకరించాలి-మంత్రి కొలుసు




ముదినేపల్లి, (ప్రభాత సూర్యుడు) : క్లిష్టపరిస్థితుల్లో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు అందరూ సహకరించాలని రాష్ట్ర గృహనిర్మాణ , సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ముదినేపల్లిలో ఏర్పాటు చేసిన ఎన్డీఏ కూటమి కార్యాలయాన్ని మంత్రి పార్థసారధితో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ , ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం మండల టిడిపి అధ్యక్షులు చల్లగుళ్ళ శోభనాద్రిచౌదరి , బొర్రా చలమయ్య అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంపి పుట్టా మహేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన రహదారులు , వివిధ సాగునీటి ప్రాజెక్టుల రూపకల్పనకు కేంద్రం రూ 1200 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఎమ్మెల్యే డా కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకోవాలని కూటమి గానే ఉండాలని , తారతమ్యాలు , ఎలాంటి విభేదాలు లేకుండా సమస్యలు స్థానికంగానే పరిష్కరించుకోవాలన్నారు. అమరావతి రాజధాని బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవిని అంబేద్కర్ మెమొంటోను బహుకరించి మంత్రి , ఎమ్మెల్యే , ఎంపీలు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు , మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు , ఎన్డిఏ నాయకులు కోడూరు శేషుబాబు , బండ్రెడ్డి రామకృష్ణ , కోటప్రోలు కృష్ణ , ఈడుపుగంటి శ్రీనివాస్ , చల్లగుళ్ళ ఆదిత్యచౌదరి , పరసా విశ్వేశ్వరరావు , ఏఎన్ బాబు , దావు నాగరాజు , బికేయం నాని , వేల్పూరి నానాజీ , రౌతు రాధిక , దారం సుధ , సత్యవోలు నాగలక్ష్మి , ఎన్డీఏ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంపీడీవో గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన పి మల్లేశ్వరి , కార్యదర్శులు

ముదినేపల్లి, (ప్రభాత సూర్యుడు) : ఇటీవల ఎన్నికల నిర్వహణలో భాగంగా బదిలీపై వెళ్లిన ముదినేపల్లి ఎంపీడీవో పి మల్లేశ్వరి మరల కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. మండలంలోని వడాలి గ్రామపంచాయతీ కార్యదర్శిగా కె సంగమయ్య , శ్రీహరిపురం వై వెంకటఅప్పారావు , వణుదుర్రు ఎం శ్రీకాంత్ , పెదగొన్నూరు ఎం రాధ , వాడవల్లి కె రుక్మిణి , చేవూరు టీజీ కృష్ణారెడ్డి , కోడూరు డి మైనిజ లు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

# అనాథ మృతదేహానికి అంత్యక్రియలు చేసి మానవత్వాన్ని చాటిన గుడివాడ పట్టణ ఆర్కే వారియర్స్






కృష్ణాజిల్లా గుడివాడ, (ప్రభాత సూర్యుడు) : పట్టణ స్థానిక రైల్వే స్టేషన్ రోడ్లో కొంతకాలంగా భిక్షటన చేసుకుంటూ అనారోగ్యంతో వృద్ధ తల్లి చనిపోవడంతో అన్ని తామై అంతక్రియలు చేసి గుడివాడ పట్టణ ఆర్కే వారియర్స్ మానవత్వాన్ని చాటారు. ఈ సందర్భంగా గుడివాడ పట్టణ సామాజికవేత్త డాక్టర్ మాచర్ల రామకృష్ణ (ఆర్.కె )మాట్లాడుతూ సమాజమే దేవాలయం గా భావిస్తూ మానవసేవయే మాధవసేవ అనే నినాదంతో ఆకలితో ఉన్న అనార్థులకు ఆకలి తీర్చడమే కాకుండా అనాధ అంత్యక్రియలు కూడా చేయడం అదృష్టంగా భావిస్తున్నామని, అదేవిధంగా ఈరోజు భిక్షాటన చేసుకునే ఒక వృద్ధ తల్లి అనారోగ్యంతో చనిపోవడంతో స్థానికులు సమాచారం అందజేయగా పోలీస్ వారికి సమాచారం అందజేసి అంతక్రియలు చేయడం జరిగింది అని తెలియజేశారు, ఇదే చేత్తో ఈ తల్లికి రోజు భోజన సదుపాయం అందించేవాడినీ అని అదే చేత్తో అంతక్రియలు చేయడం చాలా బాధాకరమైన విషయం అని, దయచేసి మానవత్వాన్ని బ్రతికించాలని గుడివాడ పట్నంలో అనాధలు గాని పిల్లలు లేకపోయినా వాళ్లే గాని ఎవరైనా ఉంటే అన్ని నేనే ఇలాంటి దాహం సంస్కారాలు చేస్తారని తెలియజేశారు, ఆ వృద్ధ తల్లి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని కోరుకుంటున్నానని తెలియజేశారు,లిఈ కార్యక్రమంలో శివ, చరణ్, శ్యాం బాబాయ్ ఫ్రెండ్ సర్కిల్, ఆర్కే వారియర్స్ పాల్గొన్నారు.

# మెట్ట ప్రాంతం ఉదయగిరి అభివృద్ధికి చేయూత నివ్వండి

## - ఉదయగిరి జిల్లా ఏర్పాటుకు సహకరించండి
## - సోమిరెడ్డిని కోరిన ఉదయగిరి జిల్లా ఉద్యమ నేతలు




నెల్లూరు/దుత్తలూరు, **(ప్రభాత సూర్యుడు)** :స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ఉదయగిరి ప్రాంతం పాలకుల నిరాదరణతో వెనకబాటుకు గురైందని, ఇకనైనా అభివృద్ధి పథం వైపుకు అడుగులు వడేందుకు జిల్లా సీనియర్ నాయకులుగా తోడ్పాటు అందించాలని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డిని ఉదయగిరి జిల్లా ఉద్యమ నేతలు కోరారు. నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం డాక్టర్ కె.వేణుగోపాల్ మరియు ఖాజా ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు.నెల్లూరు ప్రకాశం,కడప జిల్లాల్లోని వెనబడిన 21 మెట్ట మండలాలను కలిపి ఉదయగిరి జిల్లాగా చేయాలని కోరారు.దశాబ్దాలుగా సోమశిల హై లెవెల్ కాలువ గాని, వెలుగొండ ప్రాజెక్ట్ గాని పూర్తికాలేదన్నారు. త్రాగు సాగు నీరు లేక మెట్టప్రాంత ప్రజలు అనాదిగా ఇక్కట్ల పాలౌతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. విద్య ,వైద్య ,రవాణా తదితర సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వెనుకబడిన ప్రాంతాన్ని జిల్లా చేయడం ద్వారా శీఘ్ర అభివృద్ధి సాధ్యపడుతుందని వారు కోరారు.జిల్లా అవశ్యకత పై సోమిరెడ్డి సానుకూలంగా స్పందించారు.సోమిరెడ్డి వెంట నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు. జిల్లా ఉద్యమ కారులు ఓంకారం శ్రీనివాసరాజు,దశరథ రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరు పోలీసు పెరేడ్ గ్రౌండ్ లో 78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## జాతీయ పతాక ఆవిష్కరణ చేయనున్న రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మాత్యులు శ్రీ కొలుసు పార్ధసారధి



ఏలూరు, **(ప్రభాత సూర్యుడు)** : ఏలూరు పోలీసు పెరేడ్ గ్రౌండ్ లో ఆగస్టు, 15 గురువారం నాడు నిర్వహిస్తున్న 78 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిధిగా రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మాత్యులు శ్రీ కొలుసు పార్ధసారధి హాజరు కానున్నారు. ఈ వేడుకలలో గురువారం ఉదయం 8.45 గంటలకు ముఖ్య అతిధి ఆగమనము, 9.00 గంటలకు గౌ. మంత్రివర్యులు శ్రీ కొలుసు పార్ధసారధి జాతీయ పతాక ఆవిష్కరణ చేస్తారు. అనంతరం 9.05 గంటలకు ముఖ్య అతిధి వారిచే పోలీస్ గౌరవ వందన స్వీకరణ, పోలీసు పెరేడ్ గ్రౌండ్ సందర్శన, 9.15 గంటలకు ముఖ్య అతిధి వారి సందేశం, 9.30 పోలీస్ కవాతు, 10.00 గంటలకు వివిధ శాఖల ప్రగతి శకటాల ప్రదర్శన, 10.20 గంటలకు వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శన, ఉ.10.40 గంటలకు విద్యార్థినీ, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, 11.15 గంటలకు ప్రశంసాపత్రాల ప్రదానం, 11.45 గంటలకు జాతీయ గీతాలాపన కార్యక్రమాలు ఉంటాయి.

# సహకార సంఘాలలో లావాదేవీలు పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ చేయాలి

## సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు-జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

ఏలూరు, **(ప్రభాత సూర్యుడు)** :జిల్లాలోని అన్ని సహకార సంఘాలలోని లావాదేవీలు పూర్తి స్థాయిలో కంప్యూట రీకరణ చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సహకారశాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో సహకార సంఘాల వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న దన్నారు. రాబోయే 5 సంవత్సరాలలో పెద్ద సంఖ్యలో మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీలు, ప్రైమరీ ఫిషరీ సొసైటీలు, డెయిరీ కోఆపరేటివ్ సొసైటీల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదన్నారు. జిల్లాలో సహకార ఉద్యమాన్ని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడం ద్వారా సహకార రంగంలో స్థిరమైన ఆర్థిక అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి వీలుకలుగుతుందని, అధికారులు ఈ దిశగా పనిచేయాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా పెట్రోల్ బంకు లు, ధాన్యం నిల్వ గోడౌన్ లు, ఈ-సేవా వంటి కామన్ సర్వీస్కేంద్రాలు వంటివి ఏర్పాటు చేయడం ద్వారా వాటిని మరింత ఆర్థిక పరిపుష్టి దిశగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, అర్బన్ సహకార బ్యాంకులు, ఉద్యోగుల సహకార పరపతి సంఘాలు, పాడిరైతులు, గొర్రెల పెంపకందారుల , మత్స్యకారులు, తదితర సహకార సంఘాలు, సహకార మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యం లోని సంఘాలు, తదితర అన్ని సంఘాలు కలిపి జిల్లాలో 882 సహకార సంఘాలున్నాయన్నారు. సదరు సహకార సంఘాల సక్రమ నిర్వహణ నిమిత్తం అందుకు తగిన విధంగా వాటిలో జరిగే సభ్యత్వం, డిపాజిట్లు, రుణాలు, పెట్టుబడులు, తదితర లావాదేవీలు అన్నీ నిర్దేశించిన సమయంలో కంప్యూటరీకరణ చేయాలన్నారు. ప్రపంచ అతిపెద్ద ధాన్యం నిల్వ ప్రణాళిక ద్వారా జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ గా 5 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను గుర్తించి, వాటి ఆధ్వర్యంలో గోడౌన్ల ఏర్పాటు, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మల్టీ పర్పస్ ఫెసిలిటేషన్ కేంద్రాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు.


# మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని చట్టబద్ధంగా అమలు పరచాలి : కలెక్టర్




బాపట్లబ్యూరో,**(ప్రభాత సూర్యుడు)** : మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని చట్టబద్ధంగా అమలు పరచాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సిడబ్ల్యుసి మహిళ, శిశు సంక్షేమశాఖ అధికారులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని తన చాంబర్లో ఆయన నిర్వహించారు. జువెనల్ జస్టిస్ చట్టం పక్కాగా అమలు చేస్తేనే చిన్నారులకు ప్రయోజనం చేకూరుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. నిరాశ్రయులైన చిన్నారులు, అనాధ బాలలు, సమస్యలతో ఇబ్బందులు పడుతున్న చిన్నారుల సంక్షేమ కొరకు కేంద్ర ప్రభుత్వం మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ పథకం కింద వితంతు పిల్లలు, అనాధలు, విడాకులు పొందిన స్త్రీ పిల్లలు, నిరాదరణకు గురైన వారంతా అర్హులేనన్నారు. ప్రతినెల 4,000 పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. 318 మందికి ఈ పథకం కింద లబ్ధి చేకూర్చడానికి అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం 493 దరఖాస్తు వచ్చాయన్నారు. నిబంధన మేరకు వాటిని పునః పరిశీలించాలన్నారు. చిన్నారుల కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72వేలు, పట్టణ ప్రాంతాలలో రూ.96వేలు ఉన్న వారంతా అర్హులని చెప్పారు. జెవివి చట్టం కింద దరఖాస్తులను పరిశీలించిన తదుపరి అర్హత పొందిన వివరాలను నివేదించాలన్నారు. చిన్నారులకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. బాలల సంక్షేమ మండలి పనితీరుపై అరా తీశారు. ఈ సమావేశంలో మహిళ సంక్షేమ శాఖ పీడీ ఉమా, (సి డబ్ల్యూ సి) బాలల సంక్షేమ మండలి) చైర్మన్ ప్రమీల, సభ్యురాలు దుర్గ భవాని, డిసిపిఓ పురుషోత్తం, పిఓ స్వప్నప్రియ, తదితరులు పాల్గొన్నారు.

# చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పనులలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## - బ్రిడ్జి నిర్మాణ విషయంలో తగు చర్యలు తీసుకోవాలి...
## - జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి



ఏలూరు, **(ప్రభాత సూర్యుడు)** : ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ముందుకు తీసుకువెళ్లేందుకు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో ఇరిగేషన్, జాతీయ రహదారులు, రెవిన్యూ అధికారులతో చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి(గ్రీన్ ఫీల్డ్) %-% 365 నిర్మాణంలో చింతలపూడి మండలం వెంకటాపురం గ్రామ పరిధిలో చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ ప్రతిపాధన నిమిత్తం బ్రిడ్జి నిర్మాణ విషయంలో సమస్యపై ఎన్ హెచ్ ఖమ్మం, ఇరిగేషన్ ఎస్ఇ విస్సన్నపేట తదితర అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. బ్రిడ్జి నిర్మాణ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన సమగ్ర వివరాలతో ఎన్ హెచ్ ఉన్నతాధికారులకు లేఖ ద్వారా తెలియజేసి అవసరమైన ఆదేశాలు పొందాలన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డి, నూజివీడు ఆర్డీవో వై.భవానీ శంకరి,ఇరిగేషన్ ఎస్ఈ కె. శ్రీరామకృష్ణయ్య , ఎన్ . హెచ్. అధికారి దివ్వవాణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం. ముక్కంటి, తదితరులు హాజరయ్యారు.

# దేశ భక్తిని చాటేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు..

## - ప్రతి ఇంటిపైనా మువ్వన్నెల జెండా రెప రెపలాడాలిశా
## - పలు ప్రాంతాల్లో సెల్ఫీ పాయింట్లు
## -జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

ఏలూరు,ఆగష్టు14 : ఆజాది కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. జాతీయ సమైక్యతను చాటి చెప్పేలా ప్రతి పౌరుడు తన ఇంటి పైన మువ్వన్నెల జెండాను ఎగుర వేయాలని కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొని అనంతరం మాట్లాడారు. ఈ సందర్భంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల పై సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేసారు. మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించుకున్నామని బుధవారం బైక్ ర్యాలీని నిర్వహంచుకుంటున్నామన్నారు. జిల్లాలో జాతీయ జెండాతో సెల్ఫీలు తీసుకొని సంబంధిత వెబ్ సైట్ లో నమోదు చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో పిల్లలతో ప్రతిజ్ఞ చేయించి జాతీయ జెండాలను చేత పట్టి ర్యాలీలు నిర్వహించాలని , వాటి ఫోటోలను తీసి హర్ ఘర్ తిరంగా వెబ్సైటు నందు అప్లోడ్ చేయాలని జిల్లా విద్యా శాఖాధికారి కి సూచించారు. పంచాయతి రాజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి పంచాయతిలో జాతీయ సమైక్యత పై పోటీలు నిర్వహించాలని తెలిపారు. మండల ప్రధాన కేంద్రాల్లో, అన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరు సెల్ఫీ దిగి ఫోటో ను వెబ్సైటు నందు అప్లోడ్ చేయాలనీ మండల అధికారులకు, కళాశాలల యాజమాన్యాలకు తెలిపారు. అదే విధంగా మున్సిపాలిటీలలో, బస్సు స్టాండ్లలో, రైల్వే స్టేషన్ వద్ద ప్రాముఖ్యత ఉన్న కూడళ్ళ లో సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేయాలనీ, ఫోటోలు దిగి అప్లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు. తొలుత రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఇంటింటిపై జాతీయ జెండా ఎగుర వేసే కార్యక్రమం జయప్రదంగా నిర్వహించాలన్నారు. హర్ ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమాలు అన్ని ప్రాంతాలలో నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి చెప్పారు. భారత




ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు ఈ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. జాతీయ జెండాతో సెల్ఫీ ఫోటోలను తీసుకుని హర్ ఘర్ తిరంగా వెబ్సైట్లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులను బాగస్వాములను చేయాలన్నారు. ప్రజలలో జాతీయ భావాన్ని నింపాలన్నారు. ప్రభుత్వ కార్యాలన్నింటిలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాలు జరపాలన్నారు. స్థానిక సంస్థలలోనూ స్వాతంత్ర వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమాల నిర్వహణపై విస్తృత ప్రచారం, ప్రదర్శన నిర్వహించాలన్నారు. ప్రజలలో జాతీయ భావాన్ని పెంపొందించడానికి అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు. వాహనాలకు సైతం జాతీయ పతాకాలను తగిలించుకొని నగరం, పట్టణాలలో ప్రదర్శనలు చేసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, జెడ్పి సిఇఓ కె. సుబ్బారావు, పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215